క్లుప్తంగా

వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం బేస్తగల్లిలో గురువారం నుంచి దుర్గమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు ఆలయ ఆవరణలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతిపూజ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, సీతారం, శ్రీహరి, కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా నవీన్ ఎన్నిక



నిజాంపేట(మెదక్): ఎస్ఎఫ్ఐ 27న మహాసభల్లో మెదక్ జిల్లా అధ్యక్షుడు జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకత్వం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని నగరం గ్రామానికి నవీన్‌ను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థుల పక్షాన నిలబడి విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ లక్ష్యం కోసం పని చేస్తానని, దేశంలో శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు పరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, హాస్టల్ విద్యార్థులకు రాగి జావ అందించాలన్నారు.

కేజీబీవీ భవనానికి మరమ్మతులు



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం కేజీబీవీ భవన నిర్మాణానికి మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.76 లక్షలు మంజూరు చేశారు. దీంతో గురువారం కాంట్రాక్టర్‌తో ఏఈ మల్లప్ప పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఫార్మసిస్టును సన్మానిస్తున్న సిబ్బంది

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పనిచేస్తు పదవి విరమణ పొందిన పగడయ్యకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు పదవి విరమణ సహజమే అన్నారు. శేష జీవితంలో పగడయ్య స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంపతి, అనురాధ, సీహెచ్‌ఓ కిషన్, అనిత, కిరణ్‌కుమారి, రాజిరెడ్డి, నరేశ్, ఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు

నర్సాపూర్: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మిస్తున్న మురికి కాల్వలు, సీసీ రోడ్ల పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా ఆయా వార్డుల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, బాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కొల్చారం(నర్సాపూర్): నేడు మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం 120 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్ ఇక్కట్లు తీరేదెన్నడో..?

- కనిపించని ఫుట్‌పాత్‌లు
- రోడ్లపైనే వాహనాలు.. దుకాణాల సామగ్రి
- తోపుడు బండ్లతో మరిన్ని ఇబ్బందులు



కూరగాయల మార్కెట్ ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ తిప్పలు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యతో నిత్యం వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు పట్టణంలో తక్కువ రద్దీ ఉండేది. మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి వాహనాల రద్దీ ఎక్కువైంది. పెరుగుతున్న జనాభా వాహనాల రద్దీకి అనుగుణంగా జిల్లా కేంద్రంలో నర్సాపూర్ – బోధన్ చౌరస్తాల వరకు ప్రధాన రోడ్డు వెడల్పు చేసి ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేసినప్పటికీ సమస్య తీరడం లేదు. ప్రధాన రోడ్డులోని ఫుట్‌పాత్‌లను రోడ్డుకి ఇరువైపుల ఉన్న దుకాణ దారులు వాటిని కబ్జా చేశారు. దీంతో పట్టణంలో ఫుట్‌పాత్‌లు కనిపించకుండా పోయాయి. మరోవైపు దుకాణాదారులు వారి వాహనాలు, వ్యాపారులు వారి వ్యాపార సామగ్రి ఫుట్‌పాత్ దాటి రోడ్లపైనే పెడుతున్నారు. దీంతో రోడ్డు విస్తరణ చేసిన ఫలితం లేకుండా పోయింది. ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోంది.

జే.ఎన్ రోడ్డులో...

పట్టణంలో ప్రధాన వ్యాపార కేంద్రం జె.ఎన్.రోడ్డులో వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు, దుకాణదారుల వాహనాలతో రద్దీగా ఉంటాయి. దీంతో ద్విచక్ర వాహనం నడవడం కూడా కష్టంగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో తోపుడు బండ్ల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తామని మున్సిపల్ పాలక వర్గం ప్రకటనలు చేసినప్పటికీ దాన్ని అమలు చేయలేదు. దీంతో ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభానికి నోచుకోని రైతు బజార్

మెదక్ జిల్లా కేంద్రం ఏర్పడ్డాక కూరగాయాల సంత పెరిగిపోయిందనే చెప్పాలి. నిత్యం కూరగాయల సంత ఉదయం 7 నుంచి రాత్రి 9 వరకు కొనసాగుతోంది. కూరగాయల మార్కెట్‌లో రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రైతు బజార్‌ను ఇంకా ప్రారంభించక పోవడంతో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు తీవ్రమవుతుంది. మార్కెట్‌కు వచ్చే ప్రజలకు వాహనాల పార్కింగ్ లేకపోవడంతో రోడ్లపైనే పెడుతున్నారు. ఇది కూడా ట్రాఫిక్ సమస్యగా మారుతోంది. అలాగే పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల పండ్ల దుకాణాలు ఫుట్‌పాత్‌లు దాటి ప్రధాన రోడ్డుపైకి పెడుతున్నారు. దీనికితోడు ఆటోలు నిలుపుతున్నారు. ఫలితంగా తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ విషయమై పట్టణ ప్రజలు పాలకులకు, మున్సిపల్ అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినా.. మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లు కనిపించడం లేదు



పట్టణంలోని ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్‌లు కన్పించడం లేదు. కానీ రోడ్డుకు ఇరువైపుల ఉన్న వ్యాపార దుకాణాదారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారు. మరోవైపు వారికి సంబంధించిన వాహనాలు, సామగ్రి సైతం ఫుట్‌పాత్ దాటి రోడ్లపైనే పెడుతున్నారు. దీంతో రోడ్డు వెడల్పు చేసిన ఫలితం కనిపించట్లేదు.

– ప్రభాకర్, మెదక్

అధికారులు పట్టించుకోవడం లేదు



రోడ్డు విస్తరణ చేసినప్పటికీ వాటిని అమలు చేసే విధానాన్ని అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు రోడ్లపైనే అమ్మకాలు చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యకు తైబజార్ వసూలు చేసే మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

– సందీప్, మెదక్

చర్యలు తీసుకుంటాం

పట్టణంలోని కొత్త బస్టాండ్‌తో పాటు ప్రధాన రోడ్డు ఇరువైపుల ఉన్న దుకాణాదారులకు సూచనలు చేశాం. ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వ్యాపారులకు, రోడ్లపై వాహనాలు పెడుతున్న వారికి నిబంధనలు అతిక్రమించి ట్రాఫిక్ సమస్యలకు కారణమైతే శాఖపర చర్యలు తీసుకుంటాం.

– దిలీప్‌కుమార్, సీఐ, మెదక్ టౌన్

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట(మెదక్): సమాజంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని చీలాపల్లి స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు రామచంద్రాచారి, బి.శ్రీనివాస్, కుమార్, వెంకటేశం, మారుతి, విఠల్‌నాయక్, విజయ్‌కుమార్, అశోక్‌రెడ్డి, ప్రసన్న, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు బీజేపీ ప్రచారం



నిజాంపేట(మెదక్): నందిగామలో బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్న నాయకులు



అల్లాదుర్గం(మెదక్): గడిపెద్దాపూర్‌లో బీజేపీ నాయకుల ప్రచారం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గురువారం లాభార్థి సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా గడపగడపకు మోదీజీ, ఫిర్ ఏక్ బార్ మోదీ జీ సర్కార్ నినాదంతో ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు నందిగామ గ్రామంలోని ప్రతీ వార్డుల్లో గడప గడపకు తిరిగి మోదీ చేసిన మంచి పనిని గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లాభార్థి సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా గడపగడపకు మోదీజీ, ఫిర్ ఏక్ బార్ మోదీజీ సర్కార్ నినాదం చేశారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపే లక్ష్యంగా గ్రామంలోని ప్రతీ గడపగడపకు వెళ్లి కమలం పువ్వు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్, అంజయ్య, ఆకుల శీను, నాగరాజు గౌడ్, కిషన్ నాయక్, ఆకుల రాములు, బాజ లింగం తదితరులు పాల్గొన్నారు.

గడిపెద్దాపూర్‌లో..

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో బీజేపీ ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిశంకర్, ప్రభాకర్‌గౌడ్, వసంత, నరేందర్, యాదగిరి, రాములు, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న టీపీటీఎఫ్ సంఘం నాయకులు

నర్సాపూర్: గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్ని మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్స్ తదితర బిల్లులన్నింటిని గత ప్రభుత్వం జాప్యం చేసిందని ఆరోపిస్తూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయ పదోన్నతులను, బదిలీలను నిలిపివేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకపోవడం, 317 జీఓ పరిష్కారం కమిటీ వేసి కాలయాపన చేస్తున్నారన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించని పక్షంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, మధుసూదన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, సాయిబాబా, రాధాకృష్ణ, వెంకటేశం, నరేందర్‌రావు, నర్సింహరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించుకోవాలని మండల ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్ రైతులను కోరారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లి, కాజీపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని ప్రమాణాలకు అనుకూలంగా ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటులను పొందాలని కోరారు. ధాన్యం తూకం వేసే సమయంలో బ్యాంకు అకౌంట్ నెంబర్, పట్టా పాస్ బుక్ వెంట తెచ్చుకోవాలని రైతులకు తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని విక్రయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు ప్రవీణ, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిలిచిన ఈఎస్ఐ సేవలు



తూప్రాన్‌లో తాళం వేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

తూప్రాన్: నాలుగు రోజులుగా ఈఎస్ఐ వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే ఏకైక ఈఎస్ఐ డిస్పెన్సరీ కావడం విశేషం. నిత్యం సుమారు 60 నుంచి 80 మంది వరకు ఓపీ ఉంటుందని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. డిస్పెన్సరీ నిర్వహిస్తున్న ఇంటి అద్దె గత ఏడాదిగా చెల్లించని కారణంగా ఇంటి యజమాని తాళం వేసిన సంగతి తెలిసిందే. నిత్యం వైద్య సిబ్బందితో పాటు రోగులు ఆస్పత్రి(డిస్పెన్సరీ) వద్దకు వచ్చి వేళ్తున్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ స్పందించి డిస్పెన్సరీని తెరిపించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

గొర్రెల మందను ఢీకొట్టిన లారీ



మృతిచెందిన గొర్రెలు

20 జీవాలు మృత్యువాత

చిన్నశంకరంపేట(మెదక్): గొర్రెల మందను లారీ ఢీకొట్టిన ఘటన మండలంలోని కొర్విపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం మెదక్ మండలం శమ్నాపూర్‌కు చెందిన కొరెంకల శ్రీశైలం, మహిపాల్ గొర్రెల మందను మేతకు తీసుకెళ్లి ఇంటి బయలు దేరారు. మెదక్ – చేగుంట రహదారిపై ఒక పక్కకు వస్తున్న గొర్రెల మందను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయంపై పోలీస్‌లకు సమాచారం అందించినట్లు బాధితులు తెలిపారు. గొర్రెల కాపరులకు నష్టం కలిగించిన లారీ డ్రైవర్‌పై చర్యలు చేపట్టి బాధితులకు నష్ట పరిహారం అందించాలని సీఐటీయూ మెదక్ నియోజవర్గ నాయకుడు మల్లేశం కోరారు.

రెండు బైక్‌లు ఢీ

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



హవేళిఘణాపూర్(మెదక్): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని పాతూర్ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మెదక్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ గ్రామ పంచాయతీ గజుల్యాయి తండాకు చెందిన జయరాం(50)భార్య మాలోత్ మారోని కలిసి మెదక్ వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో శమ్నాపూర్‌కు చెందిన శివకుమార్ మెదక్ హోటల్‌లో పనులు ముగించుకొని శమ్నాపూర్ వెళ్తున్నాడు. పాతూరు శివారులోకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో జయరాం అక్కడికక్కడే మృతి చెందాడు. మారోని, శివకుమార్‌కు గాయాలు కాగా వారిని వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించారు. మెదక్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నర్సాపూర్ రూరల్: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. 7న జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, బ్లాక్, బ్లూ పెన్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందు చేరుకోవాలన్నారు. 6వ తరగతిలో చేరేందుకు పరీక్ష రాయాల్సిన విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు పరీక్ష ఉంటుందన్నారు. 6వ తరగతి పరీక్ష కేంద్రాలు మోడల్ స్కూల్‌తో పాటు, రెడ్డిపల్లి జిల్లా పరిషత్‌ల పాఠశాలలో ఉంటాయన్నారు. 7, 8, 9, 10 వ తరతల్లో చేరేందుకు పరీక్ష రాసే విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు మోడల్ స్కూల్‌లోనే పరీక్ష కేంద్రం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష సమయం ఉంటుందని తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



భుజిరంపేటలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట, కూకుట్లపల్లి, హరిచంద్‌తండా తదితర గ్రామాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కరు ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భుజిరంపేట పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు పని ప్రదేశంలో సరిపడ మంచినీళ్లు తాగాలని చెప్పారు. ఎండలో ఎక్కువసేపు ఉండవద్దని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశవర్కర్లు సుగుణ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మీశారద



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మీశారద

హవేళిఘణాపూర్(మెదక్): ప్రతీ ఒక్కరు బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మీశారద అన్నారు. గురువారం మెదక్ మండల పరిధిలోని కొంటూర్ గ్రామంలో బాల హక్కులు, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై వేధింపులు జరిగినట్లయితే పోలీసులకు సంప్రదించాలని కోరారు. లోక్ అదాలత్‌లో భూ యాజమాన్య హక్కులు, సీనియర్ సిటిజన్స్ చట్టం, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించకపోతే పోలీసులను సంప్రదించవచ్చన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు న్యాయం జరుగకపోతే తమను సంప్రదిస్తే వారికి న్యాయం చేసేందుకు తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు సిద్ధాగౌడ్, సిద్ధిరాములు, కరుణాకర్, మధుకిరణ్, నర్సింలు, ప్రమీల, దయశీల, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నార్సింగి కాంగ్రెస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు దిశ నిర్దేశనం చేశారు.

◆ **చలివేంద్రం ప్రారంభం**



రామాయంపేట(మెదక్): పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కనే మెదక్ రూటులో గురువారం చలివేంద్రాన్ని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యక్షేత్రం వారి ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ ప్రతినిధి సంగమేశ్వర్, ఇతర వ్యాపార వర్గాల వారు పాల్గొన్నారు.

◆ **గ్రామాల్లో పోలీసుల కవాతు**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చేగుంట, మాసాయిపేట, మక్కరాజీపేట గ్రామాల్లో కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతల కోసం గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు రామాయంపేట సీఐ వెంకటేశ్ తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐతో పాటు చేగుంట ఎస్ఐ బాలరాజు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

◆ **ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధం**



టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని తంపులూరు గ్రామంలో గురువారం సంభవించింది. గ్రామానికి చెందిన జక్కుల రాములు, జక్కుల అంజయ్య పశుగ్రాసం కోసం నిల్వ చేసిన గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సుమారుగా 200 గడ్డిమోపులు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. గడ్డివాములతో పాటు రెండు పెంటకుప్పలు తగలబడినట్లు గ్రామస్తులు చెప్పారు. ప్రభుత్వం ద్వారా బాధితులకు ఆస్తి నష్టం అందించాలని స్థానికులు కోరారు.

◆ **అంధకారంలో కాలనీలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని పలు కాలనీలు అంధకారంలో ఉన్నారు. పలు కాలనీలోని వీధిలైట్లు పాడైపోవడంతో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల నుంచి వీధి లైట్లు వెలగడం లేదని పలుమార్లు పంచాయతీ కార్యాలయంలో చెప్పిన సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు అన్నారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి రమాదేవి వివరణ కోరగా.. విద్యుత్ శాఖ నుంచి ఎల్సీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నందువల్ల వీధిలైట్ల ఏర్పాటులో ఆలస్యం అయిందన్నారు. గురువారం నుంచి ఎల్సీ తీసుకొని లైట్లు బిగిస్తున్నామన్నారు.

◆ **నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం**

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు తెలిపారు. ఉమ్మడి మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. శశ

కొత్తపల్లిలో..

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించన్నుట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మండలాధ్యక్షుడు జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి, ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డిలు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జగన్ కోరారు.

◆ **దైవ దర్శనానికి వచ్చి..**

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తుడు నీట మునిగి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకున్నట్లు పాపన్నపేట ఎస్సై నరేష్ తెలిపారు. హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్‌కు చెందిన వెంకటేశ్(28) బంధువులతో కలసి ఏడుపాయలకు వచ్చాడు. స్నానం చేసేందుకు వెళ్లి మంజీర పాయల్లో మునిగి చనిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.